
సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384

సంపుటి: 01 సంచిక: 07 సమాజహితం - తెలుగు దినపత్రిక ఎడిటర్: హరీష్ ఆచార్య గురువారం 12-11-2026 పేజీలు: 06 వెల: రూ.2.00





2వ పేజీలో...

కుమార్తే కిమ్ వారసురాలు

భావి నాయకురాలిగా ఆమెను తీర్చిదిద్దుతున్న ఉత్తర కొరియా అధినేత



నేడు విశాఖకు..

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరు
- సీఎం చంద్రబాబుతో భేటీ.. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చ
- పలువురు కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశం
- రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా కీలక ఒప్పందాలకు అవకాశం



అజీత్ డోభాల్‌కు అమెరికా కోర్టు సమన్లు

తన హత్యకు కుట్రపన్నారని ఆరోపిస్తూ కేసు వేసిన ఖలిస్థానీ వేర్పాటువాది పన్నూ

దిల్లీ/వాషింగ్టన్: జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్, 'రా' మాజీ అధినేత సామంత్ గోయెల్‌కు అమెరికాలోని డిస్ట్రిక్ట్ కోర్టు సమన్లు జారీ చేసింది. తనను హతమార్చేందుకు భారత అధికారులు కుట్రపన్నారని ఆరోపిస్తూ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన సివిల్ దావా విచారణ ప్రక్రియలో భాగంగా కోర్టు ఈ చర్య తీసుకుంది. ఈ సమన్లను దౌత్య మార్గాల ద్వారా వాషింగ్టన్‌లోని భారత్ రాయబార కార్యాలయానికి పంపించినట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ కేసులోని ఆరోపణలతో కానీ, కోర్టు విచారణ ప్రక్రియలో కానీ అమెరికా ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని తెలిపింది.

2వ పేజీలో...



తెలంగాణలో పెరుగుతున్న..

చలి తీవ్రత

- అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రోజురోజుకూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 12.5 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

2వ పేజీలో...

'సర్' పేరుతో మోదీ సర్కార్..

ఓట్లను తొలగిస్తోంది



2వ పేజీలో...

స్కాలర్‌షిప్‌లపై కూడా బీజేపీ రాజకీయం

కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థకు పెద్దపీట.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 11: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలకు 4% రిజర్వేషన్ తొలగించాలంటున్న బీజేపీ నేతలు.. గుజరాత్‌లో ఎందుకు తొలగించడం లేదు? అని ప్రశ్నించారు. మైనారిటీలకు ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



దేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, నవంబరు 11: భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయన సేవలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సర్మించుకున్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు.

ఆజాద్ ఆదర్శాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి: 'స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప పండితుడు, దేశ విద్యావ్యవస్థను అభివృద్ధి చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌సేవలు ఎల్లకాలం గుర్తుండిపోతాయి.ఆయన జీవితం, ఆదర్శాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆయన జయంతి సందర్భంగా ఈ మహనీయునికి నేను నివాళులర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో..

విజయసాయి రెడ్డి కొత్త పార్టీ ప్రకటన

విజయవాడ, నవంబరు 11 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ప్రకటించారు. పార్టీ జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తు, తెలుపు, కాషాయ రంగులో ఉండేలా పార్టీ జెండాను ఆయన రూపొందించారు.

దేవతల సాక్షిగా రాజకీయ పార్టీని ప్రారంభించా..: ఈ సందర్భంగా పరివర్తన రాజనీతి పార్టీ అధినేత విజయసాయి రెడ్డి ప్రసంగించారు. దేవతల సాక్షిగా రాజకీయ పార్టీని ప్రారంభించానని స్పష్టం చేశారు. మార్పు అన్నది ప్రజలే తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏపీ భవిష్యత్తు ఏ నాయకుడు చేతుల్లో లేదని.. ప్రజల చేతుల్లో ఉందని వ్యాఖ్యానించారు. అధికార, ప్రతిపక్షాలు రెండు తప్పు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు.



రెండో ప్రయోగానికి.. స్కైరూట్ సిద్ధం!

కీలక ఇంజిన్ పరీక్ష సక్సెస్.. డిసెంబర్‌లో నింగిలోకి!

హైదరాబాద్ : భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల దూకుడు పెరుగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరో స్పేస్ తన విక్రమ్-1 రాకెట్ రెండో ప్రయోగానికి సన్నాహాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రాకెట్‌లో అత్యంత కీలకమైన రామన్-1 థ్రస్టర్ ఇంజిన్‌ను విజయవంతంగా పరీక్షించింది. దీంతో రెండో ప్రయోగానికి సంబంధించిన కీలక అడ్డంకిని అధిగమించినట్లయ్యింది. విక్రమ్-1 రాకెట్ ప్రయాణంలో రామన్-1 థ్రస్టర్ ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా రాకెట్‌ను పైకి నడిపించే ప్రధాన ఇంజిన్లకు భిన్నంగా..

2వ పేజీలో...

ఏపీలో సీనియర్ ఐపీఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు..

నవంబర్ 13న హైకోర్టు విచారణ

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న, పదవీ విరమణ చేసిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలపై ఏపీ హైకోర్టు ఈ నెల 13న విచారణ జరపనుంది. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పులను ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ ఆలపాటి గిరిధర్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ పిటిషన్లను సచివాలయ సిబ్బంది, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు, టీటీడీ ఉద్యోగులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులు దాఖలు చేశారు. సూపర్‌న్యూమరరీ పోస్టుల కేటాయింపు, అంతర్రాష్ట్ర సీనియారిటీ నిబంధనల అమలు, ఇతర సర్వీసు ప్రయోజనాల కల్పన వంటి అంశాలపై 2018 నుంచి న్యాయస్థానం..



2వ పేజీలో...

- సర్వీస్, సీనియారిటీ అంశాల్లో ఏళ్లుగా అమలుకాని తీర్పులపై పిటిషన్లు
- విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని అధికారులకు కోర్టు ఆదేశం
- తదుపరి విచారణకు అధికారులు వ్యక్తిగతంగా హాజరు కావాలని హైకోర్టు ఆదేశం

కుమార్తే కిమ్ వారసురాలు

మొదటిపేజీ తరువాయి...

పాంగ్‌యాంగ్: పురుషాధిక్య దేశమైన ఉత్తర కొరియాలో తొలిసారి ఒక మహిళకు పాలనా పగ్గాలు అప్పగించనున్నారా? దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారా? అవుననే అంటున్నారు.. ఉత్తర కొరియా నుంచి పారిపోయి వచ్చిన శరణార్థులు! వారితో పాటు దక్షిణ కొరియా నిఘా వర్గాలు అందిస్తున్న సమాచారం ప్రకారం.. కిమ్ తన కుమార్తె కిమ్ జు-ఏ (13)ను నాలుగేళ్లుగా క్షిపణి పరీక్షలు, సైనిక కవాతులకు వెంటబెట్టుకుని వెళ్తున్నారు. ఇది భావి నాయకురాలిగా ఆమెను తీర్చిదిద్దే వ్యూహంలో భాగమేనట. 1948లో ఏర్పడిన ఉత్తర కొరియాలో ఇప్పటివరకూ మూడు తరాలుగా కిమ్ కుటుంబమే నియంతృత్వ పాలన సాగిస్తోంది. ప్రస్తుతం కిమ్ జు-ఏకు ఇస్తున్న ప్రొటోకాల్‌ను చూస్తుంటే.. కిమ్ వారసురాలిగా ఆమెకు అధికారిక ముద్ర పడినట్లేనని ఉత్తర కొరియా మాజీ దౌత్యవేత్త తే యోంగ్-హో తెలిపారు. గతంలో కిమ్ జోంగ్ ఉన్‌ను వారసుడిగా ప్రకటించినప్పుడు ఇలాంటి గౌరవ మర్యాదలే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అధికార వర్కర్స్ పార్టీలోని 17



విభాగాల్లో ఒకే ఒక్క మహిళ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె- కిమ్ సోదరి కిమ్ యో జోంగ్. ఇలాంటి పురుషాధిక్య సమాజంలో ఒక చిన్నారిని సుప్రీం లీడర్‌గా అంగీకరించడం కొందరికి మింగుడుపడటం లేదని శరణార్థులు చెబుతున్నారు. అయితే ఉత్తర కొరియాలో కిమ్ కుటుంబాన్ని.. మనుషులను ఏలే దేవుళ్లుగా భావిస్తారని, కాబట్టి అక్కడ లింగ భేదం పెద్ద సమస్య కాదని మరికొందరు విశ్లేషిస్తున్నారు.

నేడు విశాఖకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా

మొదటిపేజీ తరువాయి...

అమరావతి,: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. నేడు గురువారం (12వ తేదీ) విశాఖపట్నంలో ప్రారంభం కానున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనితో పాటు 'మహిళా ప్రగతి సదస్సు-2026' ప్రారంభ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో ఆయన చర్చలు జరుపుతారు. 13న కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, నితిన్ గడ్కరీలతో కూడా ముఖ్యమంత్రి భేటీ అవుతారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు, అంతర్జాతీయ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, బహుళజాతి కంపెనీల సీఈవోలు పాల్గొంటారు. తయారీ రంగం, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, అధునాతన సాంకేతికత, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి అంశాలపై ఈ సదస్సు



ప్రధానంగా దృష్టి సారించనుంది. ఈ సందర్భంగా కియా సంస్థతో ప్రత్యేక ఒప్పందంతో పాటు పలు కీలక ఎంఓయూలు, ప్రభుత్వ ఉత్తర్వుల జారీ వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సదస్సులో భాగంగా సీఎం చంద్రబాబు సింగపూర్, యూఏఈ మంత్రులు, జపాన్, రష్యా రాయబారులతో పాటు పలువురు అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. అదేవిధంగా, రెన్యూ, కియా ఇండియా, ఆర్పీఎస్‌జీ గ్రూప్, మెయిల్ వంటి సంస్థల అధినేతలతో పాటు స్పేస్ టెక్నాలజీ కంపెనీలైన అగ్నికుల్, స్కైరూట్ ప్రతినిధుల తోనూ ఆయన ప్రత్యేకంగా సమావేశమవుతారు.

పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో..

విజయసాయి రెడ్డి కొత్త పార్టీ ప్రకటన



నిజం, లెక్క, ప్రజల అవసరాలు అధికార, ప్రతిపక్షాలకి కనబడటం లేదని తెలిపారు. తప్పు ఎవరు చేసిన ప్రశ్నించాల్సిందేనని అన్నారు. ప్రశ్నించడం ప్రజల హక్కు అని చెప్పారు. పీఆర్పీ అంటే మీలోని నాయకత్వ లక్షణాలను పైకి తీసుకురావడమే తమ పార్టీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలను రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని తెలిపారు.

ఆ రెండు కుటుంబాలే శాసించాలా..: ఆ రెండు కుటుంబాలే శాసించాలా.. ఆ కుటుంబాల ఆధిపత్యం వద్దని విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. ఆ రెండు కుటుంబాల నుంచే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కావాలా అని ప్రశ్నించారు. తండ్రి సీఎం అయితే కుమారుడు సీఎం కావాలా అనిఅడిగారు. ప్రతి కులంలోనాయకులుఉంటారు.. పుడతారని చెప్పుకొచ్చారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పి యువతనే సీఎంగా చేయాలనేది తమ పార్టీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తుఫాన్ వచ్చినప్పుడు ప్రశాంతత ఎలా ఉంటుందో రాబోయే రోజుల్లో రాజకీయ ప్రకంపనలు జరగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పాలకుల అరాచక పాలనపై విస్ఫోటనం ఎలా ఉంటుందో భవిష్యత్తులో ప్రజలే చూస్తారని అన్నారు. దుష్ట పరిపాలనకు ఈ సందర్భంగా తాను సవాల్ విసురుతున్నానని విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు.

ఓటు వేయడంతోనే ప్రజల పాత్ర ముగిసిపోదు..: ఓటు వేయడంతోనే ప్రజల బాధ్యత ముగిసిపోదని, అక్కడి నుంచే ప్రజాస్వామ్యంలో వారి అనలైన పాత్ర ప్రారంభమవుతుందని విజయ సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. అధికార, ప్రతిపక్షాల ఆత్మప్రశంసలు, రాజకీయ విమర్శల హోరులో నిజాలు, లెక్కలు, ప్రజల ప్రాథమిక అవసరాలు కనుమరుగవుతున్నాయని తెలిపారు. ఎవరు తప్పు చేసినా నిలదీసి ప్రశ్నించాలని అన్నారు. అది తానైనా, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అయినా ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. 'పరివర్తన రాజనీతి పార్టీ' ద్వారా మరొక నాయకుడిని ఇవ్వడానికి తాను రాలేదని, యువతలోని నాయకత్వ లక్షణాలను వెలికితీసి వారిని నాయకులుగా మార్చడానికే వచ్చానని తేల్చిచెప్పారు. ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల భవిష్యత్తును కేవలం రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని చెప్పుకొచ్చారు. యువతలోని నాయకత్వ లక్షణాలను గుర్తించి, సామర్థ్యం ఉన్న యువకుడినే ముఖ్యమంత్రిని చేయడమే తర ప్రధాన ఉద్దేశమని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అహంకారపూరితమైన రెండు కుటుంబాల నాయకత్వానికి స్వస్తి పలకాలని విజయసాయిరెడ్డి ఆకాంక్షించారు.

వైసీపీ నిర్మాణంలో నేను క్రియాశీలకం గా పనిచేశా..: ప్రతి కులంలోనూ, ప్రతి సామాజిక వర్గంలోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సామర్థ్యం ఉన్న నాయకులు ఉన్నారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రాజకీయంలో పాత పద్ధతులకు, దుష్ట పరిపాలనకు సవాల్ విసురుతూ కొత్త రాజకీయ సంస్కృతికి పునాది వేస్తున్నామని వెల్లడించారు. ఈ రాజకీయ ప్రయాణం తన ఒక్కడిది కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటమని వ్యాఖ్యానించారు. నాయకత్వ పదవులు వారసత్వంగా రాకూడదని అన్నారు. ప్రజల తీర్పు, సామర్థ్యాల ఆధారంగానే రావాలని అభిలాషించారు. రాబోయే రాజకీయ ప్రళయం ద్వారా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే పరివర్తన రాజకీయాలు మొదలవుతాయని వివరించారు. వైసీపీ నిర్మాణంలో తాను క్రియాశీలకంగా పనిచేశానని ప్రస్తావించారు. ఇప్పుడు బయటకు వచ్చానని.. అక్కడి నుంచి వచ్చేవారికి ఈ పార్టీ తలపు ఎప్పుడూ తెరిచే ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీలో 175కు 175 సీట్లలో పీఆర్పీ పోటీ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో 26 కులాలను బీసీల నుంచి తొలగించారని. ఈ విషయం గురించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

దుబ్బాకను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



రాయపోల్, నవంబర్ 11 : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దుబ్బాక నియోజకవర్గాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని, నిధుల కొరతతో ఆగిపోయిన అభివృద్ధి పనులు పున ప్రారంభించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నందుకే నిధులు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారంటే, రైతుల కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ అనాజీపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రారంభంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాల్వల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి, అవసరమైన నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. సాగునీటి వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం వల్ల నష్టపోయేది రైతులేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న రాజకీయ కోపాన్ని రైతులపై చూపించడం సరికాదని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. రైతులకు సాగునీరు అందించడం, పంటలను కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిర్మల, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు రేకుల నర్సింహారెడ్డి,

మాజీ జెడ్పిటిసి యాదగిరి, మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ లు సంతోష్ కుమార్, హనుమంతు రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యం, వెంకట్ గౌడ్, బాగిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, గల్వ దయాకర్ రెడ్డి, మండల నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్, భార్గవ్, బుజ్జి, రాజారాం మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక



కారేపల్లి, నవంబర్ 11 : కారేపల్లి మండల పరిధిలోని చీమలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం తిమ్మారావుపేట సబ్ డివిజన్, వైరా డివిజన్, ఖమ్మం సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.మాధవరావు (చైర్మన్ అండ్ మెంబర్ టెక్నికల్), ఎన్.సత్యనారాయణ (ఫైనాన్స్ సభ్యుడు), ఎం.రామారావు (ఇండిపెండెంట్ సభ్యుడు), విద్యుత్ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సభ్యులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ బిల్లుల్లో తలెత్తుతున్న సమస్యలు, మీటర్ల పనితీరు, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఇతర విద్యుత్ సేవలకు సంబంధించిన సమస్యలపై వినతులు సమర్పించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ్యులు అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కొంతమంది అర్హులైన వినియోగదారులకు వర్తించకపోవడంపై చర్చించారు. వారికి కూడా పథకం వర్తింపజేసేలా కృషి చేస్తామని సభ్యులు హామీ ఇచ్చారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్నప్పుడు వినియోగదారులు తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

'సర్' పేరుతో మోదీ సర్కార్ ఓట్లను తొలగిస్తోంది

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్ బంజారాభవన్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని, ప్రసంగించారు. సర్ (ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ) పేరుతో మైనారిటీలు, దళితులు, పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహించారు. మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మోదీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటేనని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని.. మోదీ కాళ్లపై పడింది ఎవరో అందరికీ తెలుసునని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలోపేతం చేశారని వ్యాఖ్యానించారు. దేశంలో వర్సిటీలతో పాటు ఐఐటీలను స్థాపించారని ప్రస్తావించారు. ఆనాటి పునాదుల వల్లే ప్రపంచవ్యాప్తంగా భారతీయులు రాణిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో



విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని గుర్తుచేశారు. మైనారిటీల్లో చాలామంది స్కిల్డ్ యువత ఉన్నారని చెప్పుకొచ్చారు. యువత కోసమే స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చామని వెల్లడించారు. మైనారిటీలకు విద్యా, ఉద్యోగాల్లో కాంగ్రెస్ 4% రిజర్వేషన్ కల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రెండో ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం!

మొదటిపేజీ తరువాయి...

ఇది రాకెట్ దిశను నియంత్రిస్తుంది. ముఖ్యంగా రాకెట్ తన పొడవైన అక్షం చుట్టూ తిరిగే రోల్ కదలికను నియంత్రిస్తుంది. తద్వారా ప్రయాణ సమయంలో రాకెట్‌ను సరైన దిశలో ఉంచడంతో పాటు నిర్దేశిత మార్గంలో పయనించేందుకు సహాయపడుతుంది. రామన్-1 పరీక్షలన్నీ పూర్తయ్యాయని స్కైరూట్ ప్రకటించింది. రెండో ప్రయోగానికి అవసరమైన ఏర్పాట్లను సంస్థ ఇప్పటికే ప్రారంభించింది. తదుపరి విక్రమ్-1 రాకెట్‌కు సంబంధించిన మొద టి దశ హార్డ్‌వేర్‌ను సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తరలించింది. అక్కడ రాకెట్ విడిభాగాల అనుసంధానం, ఇతర సాంకేతిక పరీక్షలు కొనసాగుతు న్నాయి. 2026 డిసెంబర్‌లో లేదా 2027 జనవరి ప్రారంభంలో విక్రమ్-1 రెండో ప్రయోగాన్ని నిర్వహించాలని స్కైరూట్ లక్ష్యంగా పెట్టుకుంది. మూడో ప్రయోగం నుంచి పూర్తిస్థాయి వాణిజ్య ప్రయోగాలను ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. జూలై 18న విక్రమ్-1 తన తొలిప్రయోగం 'మిషన్ ఆగమన్'లో విజయవంతం అయ్యింది. భూమికి సుమారు 450 కిలోమీటర్ల ఎత్తులోని ఎర్త్ ఆర్బిట్‌లోకి చేరుకుని, తన పేలోడ్లను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దీంతో కక్ష్యస్థాయి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన తొలి ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది.

ఏపీలో సీనియర్ ఐఏఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు..

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన పలు ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. అక్టోబర్ 30న జరిగిన విచారణ సందర్భంగా, ఈ కేసును ధర్మాసనం నవంబర్ 13కి వాయిదా వేసింది. ఖాళీల లెక్కింపు, నూతన పోస్టుల సృష్టి, సీనియారిటీ సమస్యల పరిష్కారంలో పరిపాలనాపరమైన చిక్కులు ఉన్నాయని, కోర్టు ఆదేశాల అమలుకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కోరారు. అయితే, న్యాయస్థానం ఇచ్చిన ప్రధాన ఆదేశాలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ కేసులో కొత్తగా ప్రతివాదులుగా చేరిన వారు రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని, ఇప్పటికే కౌంటర్లు వేసిన అధికారులు తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ధర్మాసనం తన గత ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

అజిత్ డోభాల్‌కు అమెరికా కోర్టు సమన్లు

మొదటిపేజీ తరువాయి...

విదేశీ సార్వభౌమత్వ రక్షణల చట్టం (ఎఫ్ఎస్ఏఐ) నిబంధనల ప్రకారం కోర్టు నుంచి అందిన అభ్యర్థన మేరకు సమన్లను భారత ప్రభుత్వానికి పంపించామని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. సెప్టెంబరు 30వ తేదీతో ఉన్న దౌత్య నోట్ అక్టోబరు 9న డెలివరీ అయినట్లు తెలుస్తోంది. నిషేధిత సంస్థ అయిన సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్‌జేఎఫ్) తరఫు న్యాయవాదిగా ఉన్న పన్నూ ఈ కేసు వేశారు. తనపై హత్యాయత్నం చేసినందుకు గాను పరిహారం చెల్లించాలని పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌లోని ఆరోపణలను భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. డోభాల్, సామంత్ గోయెల్‌పై గురుపత్వంత్ సింగ్ పన్నూ చేసిన ఆరోపణలు దురుద్దేశపూరితం, అబద్దాలమయం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ మంగళవారం దిల్లీలో పేర్కొన్నారు. అసంబద్ధమైన వ్యాజ్యాన్ని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. విదేశీ న్యాయస్థానాల పత్రాలను భారత్‌లోని అధీకృత విభాగమైన కేంద్ర న్యాయశాఖ ద్వారా మాత్రమే పంపించాల్సి ఉంటుందని వెల్లడించారు.

తెలంగాణలో పెరుగుతున్న చలి తీవ్రత

మొదటిపేజీ తరువాయి...



మంగళవారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో అత్యల్పంగా 12.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో 12.5 డిగ్రీలు, నిర్మల్ జిల్లా కుబేర్‌లో 14.6 డిగ్రీలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బషీరాబాద్, యాలాల్, మోమిన్‌పేటలో 14.7 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా మంచాలలో 14.8 డిగ్రీలు నమోదయ్యాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలో 15.1 డిగ్రీలు, హైదరాబాద్‌లోని దుండిగల్‌లో 15.9, బేగంపేటలో 16.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హకీంపేట, హయత్‌నగర్‌లో 18.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత పెరిగింది. రానున్న మూడు రోజులు చలి ప్రభావం కొనసాగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. అయితే గతేడాదితో పోలిస్తే ఈసారి చలి తీవ్రత ఎక్కువగా లేదని తెలుస్తోంది.

సంపాదకీయం

స్వతంత్ర సంస్థలకు రాజకీయ క్రీనీడ

ప్రజాస్వామ్యానికి కాపలాదారులు గా ఉండాల్సిన రాజ్యాంగ సంస్థలు పాలకుల రాజకీయ పంజరంలో బందీలైతే ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్టే! అధికారానికి ఊడిగం చేయడానికి కాదు సంస్థలున్నది.. రాజ్యాంగాన్ని కాపాడటానికే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు పెట్టడం, ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటించడమే కాదు.. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించే వ్యవస్థలుగా ఉండాలి.పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్రసంస్థలుగా ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీయగలగాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వా మ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నా యి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నా యనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణ యాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంతకంటే కావు. ప్రజల ప్ర యోజనాలను, రాజ్యాంగ విలువలను కా పాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణ యాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్టా? పాలకులే జవాబు చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికిచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.పథకాలు చూడండి2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్ర జలు బ్యాంకుల ముందు క్యూలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపో యారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయం లో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేదా ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వా నికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు? ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు. ఆ హక్కును కాపాడాల్సిన ది ఎన్నికల సంఘం. అది ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత అనిపించుకోదు. ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ను ప్రభావితం చేయకుండా చూడాలి. ఈసీ నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుం చే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు?వారి అర్హత ఏంటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రా జకీయ విధేయతకు ప్రాధాన్యతనిస్తున్నా రా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుం ది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శ కత, అర్హతలకు ప్రాధాన్యముండాలి. సం స్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్ప క్ష పాతాన్ని ఆశించడం వగటికలే అవుతుంది.స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్ర యోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబు దారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మార కూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రా జ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.దేశంలో అధికారాలు శాశ్వతం కావు. ప దవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వ తం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వా టిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అం టే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణం గా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వా మ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది.రాజకీయాలు చూడండిఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు.. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండా లి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీ య ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత. సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూసే పాలకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. అధికారం ప్రజలు ఇచ్చేది.. రాజ్యాంగం పరిమితులు విధించేది! స్వతంత్ర సంస్థలను బలహీనపరిస్తే చివరకు బలహీనమయ్యేది పాలకులు కాదు.. ప్రజాస్వామ్యమే

పల్లె ప్రజ్ఞకు ప్రపంచ వెలుగు

ఒక మనిషి తన జీవితంలో ఏం సాధించాడన్నదాని కంటే, తన వల్ల ఎంతమంది జీవితాలు మారాయన్నదే అతడి గొప్పతనానికి నిదర్శనం. అలాంటి అరుదైనవ్యక్తి సంజిత్ 'బంకర్'రాయ్. గ్రామీణ పేదల సామ ర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, ముఖ్యంగామహిళలు తమ కాళ్లపై తామునిలబడగలరని ఆచరణలో నిరూపించిన సామాజిక కార్యకర్త ఆయన. రాజస్థాన్‌లోని తిలోనియాలో ఆయన స్థాపించిన 'బేర్‌ఫుట్ కాలేజీ' ద్వారా దేశ, విదేశాల్లోని వేలాది మంది గ్రామీణ మహిళలను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దారు. ఐదు దశాబ్దాలకు పైగా గ్రామీణా భివృద్ధి, మహిళా సాధికారత కోసం పనిచేసిన సంజిత్ మంగళవారం రాజస్థాన్‌లోని తిలోనియాలో 81 ఏళ్ల వయసులో కన్నుమూశారు.

పశ్చిమ బెంగాల్‌లోని బర్న్‌పూర్‌లో 1945 జూన్ 30న సంపన్న బెంగాలీ కుటుంబంలో సంజిత్ జన్మించారు. డూన్ స్కూల్‌లో చదువుకున్న ఆయన ఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. స్క్వాష్‌లో మూడుసార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచారు. ఉన్నత చదువులు, క్రీడా ప్రతిభ, మంచి కుటుంబ నేపథ్యం.. ఆయనకు ఉజ్వల భవిష్యత్తును అందుబాటులో ఉంచాయి. అయితే సంజిత్ లక్ష్యం వేరుగా ఉంది.

1966లో బీహార్‌లో కరువు విరుచుకుపడింది. బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సంజిత్ అక్కడి గ్రామాలకు వెళ్లారు. ఆకలి, పేదరికం, కనీస సౌకర్యాల లేమితో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దగ్గరగా చూశారు. తాను చదువుకున్న విద్య, సంపాదించిన డిగ్రీలు గ్రామీణుల సమస్యలను అర్థం చేసుకోవడానికి సరిపోవడం లేదని గుర్తించారు. ఒక ఇంటర్వ్యూలో ఆ అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ.. 'నేను తప్పుడు పాఠశాలకు వెళ్లాను, తప్పుడు కళాశాలలో చదివాను. అక్కడి నుంచి ఎంతో అహంకారంతో బయటకు వచ్చాను' అన్నారు. 'ఉన్నత విద్యతో ఏ సమస్యనైనా పరిష్కరించగలనని అనుకున్నాను. కానీ బీహార్‌లోని ఒక చిన్న గ్రామంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పనిచేయలేకపోయాను. ఆ అనుభవమే నా జీవితాన్ని మార్చింది' అని చెప్పారు. ఆ తర్వాత దాదాపు ఏడాదిన్నర పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు. అలా ఆయన జీవన ప్రయాణం రాజస్థాన్‌లో కొత్త మలుపు తీసుకుంది.

తిలోనియా ప్రయోగం: రాజస్థాన్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత, కరువు, వ్యవసాయ సమస్యలను గమనించిన సంజిత్ అజ్మీర్ ప్రాంతం లో బావుల తవ్వకం, సాగునీటి సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాల్లో పనిచేశారు. ఈ క్రమంలోపుస్తకాల్లో కనిపించనిఎంతో జ్ఞానం గ్రామీణుల దగ్గరఉందని గుర్తించారు. తిలోనియాకుచెందిన స్థానిక రైతు, బావుల తవ్వకంలో నిపుణుడైన మేఘరాజ్‌తో పరిచయం ఆయన ఆలోచనలను మరింత ప్రభావితం చేసింది. గ్రామీణుల జీవిత నైపుణ్యాలకు సాంకేతికతను జోడిస్తే అద్భుతాలు సాధించవచ్చని గ్రహించారు. 1972లో తిలోనియాలో 'సోషల్ వర్క్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించారు. అదే తరువాత 'బేర్‌ఫుట్ కాలేజీ'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. సంప్రదాయ విద్యాసంస్థలకు భిన్నంగా ఇక్కడ డిగ్రీలు, సర్టిఫికెట్ల కంటే ఆచరణాత్మక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. నీటి సంరక్షణ, ఆరోగ్యం, విద్య, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, సౌర విద్యుత్తు వంటి రంగాల్లో స్థానికులకు శిక్షణ ఇచ్చారు.

మహిళల చేతుల్లో వెలుగు: సంజిత్ చేసిన ప్రయోగాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది గ్రామీణ మహిళలకు సౌర విద్యుత్తు సాంకేతికతలో శిక్షణ ఇవ్వడం. చదువు లేని మహిళలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోలేరనే అపోహను ఆయన సవాలు చేశారు. ఈ శిక్షణ కోసం వృద్ధ మహిళలను ఎంపిక చేసి, సౌర దీపాల తయారీ, అమరిక, నిర్వహణ, మరమ్మతుల్లో నైపుణ్యం కల్పించారు. వీరిలో చాలామందికి చదవడం, రాయడం కూడా తెలియదు. అయినప్పటికీ రంగుల గుర్తులు, బొమ్మలు, ఆచరణాత్మక పద్ధతుల ద్వారా సాంకేతిక అంశాలను నేర్పించారు. శిక్షణ పొందిన మహిళలు తిరిగి తమ గ్రామాలకు వెళ్లి సౌర విద్యుత్తు వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీరే ప్రపంచవ్యాప్తంగా 'సోలార్ మామాస్'గా గుర్తింపు పొందారు. ఈ ప్రయోగం భారత్‌కే పరిమితం కాకుండా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకూ విస్తరించింది. ఆయా దేశాలకు చెందిన గ్రామీణ మహిళలు తిలోనియాకు వచ్చి శిక్షణ పొంది తమ ప్రాంతాల్లో సౌర విద్యుత్తు నిపుణులుగా పనిచేశారు. సంజిత్ భార్య అరుణా రాయ్ కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సామాజిక కార్యకర్త. ఐఏఎస్ అధికారిగా పనిచేసిన ఆమె ప్రభుత్వ ఉ ద్యోగాన్ని వదిలి గ్రామీణ ప్రజల హక్కుల కోసం ఉద్యమించారు.




1970లో వివాహం చేసుకున్న ఈ దంపతుల సామాజిక నిబద్ధత గ్రామీణ ఉద్యమాలకు బలాన్నిచ్చింది.

బేర్‌ఫుట్ కాలేజీ ప్రత్యేకత: సాంకేతిక పరిజ్ఞానం కొద్దిమంది నిపుణుల చేతుల్లోనే ఉండకూడదన్నది ఈ కాలేజీ ప్రధాన ఉద్దేశం. అందులో భాగంగానే భవన నిర్మాణం నుంచి విద్యుత్తు వ్యవస్థల ఏర్పాటు వరకు గ్రామీణులే కీలక పాత్ర పోషించేలా సంజిత్ ప్రోత్సహించారు. చదవడం, రాయడం రాని 12 మంది గ్రామీణులు కాలేజీ భవన నిర్మాణంలో అద్భుత పనితీరు కనబరిచారు. వారి నిర్మాణ నైపుణ్యానికి 2002లో 'ఆగా ఖాన్' అవార్డు కూడా లభించింది. భవనాలపై పడే వర్షపు నీటిని సేకరించి భూగర్భ ట్యాంకుల్లో నిల్వ చేయడం, కాలేజీ విద్యుత్తు అవసరాలను సౌరశక్తితో తీర్చుకునేలా వ్యవస్థను రూపొందించడం ఈ నిర్మాణంలోని ప్రత్యేకతలు. కుల వివక్షను అధిగమించేందుకు కూడా సంజిత్ కృషి చేశారు. అన్ని కులాల వారికీ శిక్షణలో అవకాశం కల్పించారు. సంజిత్ ప్రయాణం ఎన్నో పాఠాలు నేర్పుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, వలసలు, విద్యుత్తు కొరత, తాగునీటి సమస్యలు, మహిళల ఉపాధి వంటి సవాళ్లకు స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే స్థిరమైన పరిష్కారాలు సాధ్యమవుతాయని ఆయన నిరూపించారు. ఇందుకోసం వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. పేదరికం అంటే ప్రతిభ లేకపోవడం కాదు.. అవకాశాలు లేకపోవడం. ఆ అవకాశాలను కల్పిస్తే గ్రామీణులే తమ భవిష్యత్తును నిర్మించుకోగలరు. సామాన్యుల సామర్థ్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన సంజిత్ తిలోనియాలో వెలిగించిన దీపాలు ఆయన ఆలోచనలకు సజీవ సాక్ష్యాలు.

అమెరికాలో విదేశీ టెకీలకు ఎదురుదెబ్బ..

వీసాలపై ఐబీఎం కీలక నిర్ణయం

- ఐబీఎం కన్సల్టింగ్ విభాగంలో వీసా, గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌ల నిలిపివేత
- ట్రంప్ ప్రభుత్వ కఠిన నిబంధనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ప్రభావిత ఉద్యోగులు అమెరికా బయట పనిచేయాలి లేదా వైదొలగాలి
- గత నెలలో ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి సంస్థలపైనా ఇలాంటి ఆంక్షలు
- నైపుణ్యాలు, క్లయింట్ల అవసరాలు మారడమే కారణమంటున్న కంపెనీ



ఢిల్లీ,: ప్రముఖ టెక్ దిగ్గజం ఐబీఎం అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు షాకిచ్చింది. తన కన్సల్టింగ్ విభాగంలోని మెజారిటీ ఉద్యోగాలకు ఇకపై యూఎస్ వీసా, గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌లు అందించబోమని ప్రకటించింది. లక్షన్నర మందికి పైగా ఉద్యోగులున్న ఐబీఎం కన్సల్టింగ్ విభాగం తీసుకున్న ఈ నిర్ణయం, టెక్ రంగంలో పనిచేస్తున్న విదేశీ నిపుణులలో ఆందోళన రేపుతోంది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ టెక్ నిపుణుల నియామకాలపై కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఐబీఎం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెలలోనే మైక్రోసాఫ్ట్, అడోబ్, ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలను 'పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్' ప్రక్రియ నుంచి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇది విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డులు జారీ చేయడంలో కీలకమైన దశ. గత కొన్నేళ్లుగా తమ సంస్థలో నైపుణ్యాల కొరతను తీర్చడానికి యూఎస్ వీసా ప్రోగ్రామ్‌లను ఉపయోగించుకున్నప్పటికీ, క్రమంగా వాటిపై ఆధారపడటం తగ్గిందని ఐబీఎం ప్రతినిధి ఒకరు 'రాయిటర్స్'కు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో నైపుణ్యాల లభ్యత పెరగడం, క్లయింట్ల అవసరాలు మారడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. 'బ్లూమ్‌బర్గ్' నివేదిక ప్రకారం.. ఈ నిర్ణయంతో ప్రభావితమైన ఉద్యోగులు ఈ ఏడాది చివరిలోగా అమెరికా వెలుపల ఉన్న ఐబీఎం కార్యాలయాలకు బదిలీపై వెళ్లడం లేదా ఉద్యోగం నుంచి వైదొలగడం వంటివి చేయాల్సి ఉంటుంది. గతేడాది ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల ఫీజు విధించిన సంగతి తెలిసిందే.

రూ.500 తిరిగి ఇవ్వలేదని..

వ్యక్తిపై మరిగే నూనె పోసిన మహిళ..



నెల్లూరు: కేవలం రూ.500 అప్పు విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించలేదంటూ తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ మహిళ అతడిపై మరిగే నూనె పోసింది. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదరాజుగూడూరుకు చెందిన శీనయ్య గతంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ హసీనా వద్ద రూ.500 అప్పుగా తీసుకున్నాడు. అయితే తాను హసీనా ఇంట్లో పనిచేసి ఆ డబ్బులకు బదులుగా కూలి చెల్లించానని శీనయ్య చెబుతున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నది. ఈ క్రమంలో శీనయ్య టిఫిన్ సెంటర్‌కు వెళ్లగా.. తనకు ఇవ్వాల్సిన రూ.500 ఇంకా ఎందుకు చెల్లించలేదని హసీనా ప్రశ్నించింది. తాను ఇప్పటికే ఇంట్లో పనిచేసి అప్పు తీర్చేశానని శీనయ్య బదులిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటుచేసుకున్నది. వాగ్వాదం తీవ్రం కావడంతో హసీనా ఆగ్రహానికి గురైంది. టిఫిన్ సెంటర్‌లో కాగుతున్న నూనెను తీసుకుని శీనయ్యపై పోసింది. వేడి వేడి నూనె శరీరంపై పడటంతో పొక్కులు రావడంతో పాటు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, శీనయ్య ఒంటిపై 30 శాతం గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శీనయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు షేక్ హసీనాపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆమెను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

రెండు నెలల్లో 9 మంది జలమండలి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మృతి..!

హైదరాబాద్ : హైదరాబాద్ జలమండలి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు నెలల్లో 9 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మృతి చెందారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలను ఆగం చేసేలా ఇటీవల జారీ చేసిన టెండర్ ప్రక్రియపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 675 మంది మీటర్ రీడర్ల కుటుంబాలపై ఈ టెండర్ ప్రక్రియ తీవ్ర ప్రభావం చూపుతుందని, మరో ఉద్యోగి మరణించకముందే టెండర్ ప్రక్రియను నిలిపివేయాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ జేఏసీ డిమాండ్ చేసింది. ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం.

రాంగ్ రూట్‌లో వచ్చిన ఎస్బీఐ ఉద్యోగి..

బస్సు కిందపడి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



హైదరాబాద్: రాంగ్ రూట్‌లో బైక్ నడిపిన ఎస్బీఐ ఉద్యోగి నిర్లక్ష్యం ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రాణం తీసింది. తండ్రితో కలిసి కళాశాలకు వెళ్తున్న 21 ఏళ్ల యువతి.. ఎదురుగా వేగంగా వచ్చిన అతడి ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు కిందపడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన యువతి అక్కడిక్కడే మృతి చెందింది. హైదరాబాద్ నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీలోని హఫీజ్‌సగర్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ కుమార్తె షేక్ ఆయిషా ముస్కిరా (21) ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీఈ మైనింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం ఆరీఫ్ తన కుమార్తెను ద్విచక్రవాహనంపై కళాశాలకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఫీవర్ ఆసుపత్రి సిగ్నల్స్ వద్ద సైలా కేఫ్ సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో మరో వ్యక్తి వేగంగా బైక్‌పై దూసుకొచ్చాడు. దీంతో ఆరీఫ్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎడమవైపు పడిపోయింది. ఆయిషా మాత్రం కుడివైపు రోడ్డుపై పడిపోయింది. అప్పటికే వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కింద ఆమె పడిపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై ఆయిషా అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఏపీఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం, నవంబర్ 11 : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలోని వైన్‌షాప్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో విజయవాడ నుండి భీమవరం గ్రామానికి వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 నుండి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.

చామనఛాయ రంగు, నలుపు రంగు నిండు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు వెల్లడించారు.

కొద్దిగా బట్టతలతో పాటు నలుపు, తెలుపు వెంట్రుకలు, గడ్డం ఉన్నట్లు తెలిపారు. కుడి భుజం, కుడి మోకాలిపై పుట్టుమచ్చలు ఉన్నాయని, ఛాతీ భాగంలో గతంలో శస్త్ర చికిత్స జరిగిన ఆనవాళ్లు ఉన్నాయని వివరించారు. మృతుడిని గుర్తించిన వారు లేదా అతడి కుటుంబ సభ్యుల ఆచూకీ తెలిసినవారు వెంటనే ఎర్రుపాలెం ఎస్ఐ రమేష్‌కుమార్ సెల్ నంబర్ 8712659164 లేదా ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ నంబర్ 8712659165కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

చెరుకు రైతుకు రూ.4,500 మద్దతు ధర ఇవ్వాలి: ఎమ్మెల్యే మాణిక్ రావు

జహీరాబాద్, నవంబర్ 11 : జహీరాబాద్ నియోజకవర్గంలోని చెరుకు రైతులను ఆదుకోవాలని, వారికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ బుధవారం హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర చెరుకు శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో సుమారు 49,592 ఎకరాల్లో చెరుకు సాగు జరుగుతుండగా, ఏటా 12,39,800 మెట్రిక్ టన్నుల చెరుకు ఉత్పత్తి అవుతోందని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా స్థానిక చక్కెర కర్మాగారం మూతపడటంతో చెరుకు రైతులు తమ పంటను కోత కోసి విక్రయించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు తమ పంటను ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించుకోవాల్సి వస్తోందని, దీంతో రవాణా ఖర్చులు భారంగా మారి రైతులకు గిట్టుబాటు కావడం లేదని పేర్కొన్నారు. చెరుకు సాగు కోసం రైతులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినా సరైన ధర లభించక నష్టపోతున్నారని తెలిపారు. చెరుకు పంటకు టన్నుకు రూ.4,500 చొప్పున ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూతపడిన చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ధరణి దర్యాప్తు వేగవంతం.. భారీగా మారిన డబ్బులు

లెక్కలు తీస్తున్న సీఐడీ అధికారులు

హైదరాబాద్, : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ విప్లవంగా ప్రచారం చేసుకుని తీసుకొచ్చిన ధరణి భూముల పోర్టల్‌లో జరిగిన సంచలన అక్రమాలపై తెలంగాణ సీఐడీ ఉక్కుపాదం మోపడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. సీఐడీ విభాగంతో పాటు ప్రత్యేక దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగి హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డిలతో పాటు పలు జిల్లాల్లో ఏకకాలంలో రహస్య దాడులు, ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ క్రమంలో పోర్టల్ డెవలపర్లు, రెవెన్యూ ఆపరేటర్లు, డాక్యుమెంట్ రైటర్లతో పాటు పలువురు నిందితులను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకోవడం సంచలనం సృష్టిస్తోంది.ఫోరెన్సిక్ ఆడిట్‌లో లభించిన ఆధారాల ప్రకారం.. నాటి ప్రభుత్వంలోని కీలక పెద్దలు, నిబంధనలకు విరుద్ధంగా సెక్షన్ 22-ఏ కింద ఉన్న నిషేధిత జాబితా భూములు , కోట్లాది రూపాయల విలువైన అసైన్డ్ , సీలింగ్ మిగులు భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ దిగ్గజాల పేరిట మార్చివేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. వ్యవస్థీకృతంగా డిజిటల్ రికార్డులను ట్యాంపర్ చేస్తూ, అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి వేలాది ఎకరాలను తొలగించడం వెనుక కొందరు బీఆర్ఎస్ అగ్రనేతల ఆశీస్సులు ఉన్నాయని విచారణలో ప్రాథమికంగా వెల్లడవుతోంది.ఈ దర్యాప్తు పురోగతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ధరణి అనేది కేసీఆర్ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ కావడంతో, ఇందులో జరిగిన అవకతవకలు నేరుగా నాటి మంత్రివర్గం , ఐఏఎస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాయి. సీఐడీ దర్యాప్తు కేవలం క్రింది స్థాయి ఆపరేటర్లకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్టర్‌మైండ్స్ , బిజినెస్ నెట్‌వర్క్‌లను టార్గెట్ చేసుకుని సాగుతుండటంతో.. రాబోయే రోజుల్లో నాటి కీలక నేతలకు నోటీసులు జారీ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సీఐడీ విచారణ వేగం వెనుక స్పష్టమైన రాజకీయ అజెండా ఉందనే ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనా లోపాలు, గ్యారెంటీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కక్షసాధింపు రాజకీయాల్లో భాగంలో ధరణి దర్యాప్తును రాజకీయాస్త్రంగా ఉపయోగిస్తోందని విమర్శిస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం? బాధితులైన వేలాది మంది రైతులకు న్యాయం చేయడానికే, దోచుకున్న ప్రజా భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకే ఈ న్యాయపరమైన దర్యాప్తు జరుపుతున్నామని గట్టిగా సమర్థించుకుంటోంది.రికార్డుల డిజిటైజేషన్ పేరుతో భూ రికార్డుల అధికారాలను కేంద్రీకరించి, కొందరు వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా మార్పులు చేశారన్నది ప్రధాన నిరూపిత అంశంగా మారబోతోంది. డిజిటల్ ఫుట్‌ప్రింట్స్, లాగ్ ఫైల్స్, ఐపీ అడ్రస్‌లు ఆధారంగా దర్యాప్తు సాగుతుండటంతో ఆడిట్ ట్రయల్‌ను తప్పించుకోవడం నేతలకు



దాదాపు అసాధ్యం. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న పక్కా సాంకేతిక ఆధారాలు బయటకు వస్తే, అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తుల జప్తుతో పాటు పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని భావిస్తున్నారు. తెలంగాణలో ధరణి కుంభకోణం దర్యాప్తు కేవలం రెవెన్యూ వివాదం మాత్రమే కాదు, కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య సుదీర్ఘకాలం సాగే ప్రధాన రాజకీయ పోరాటంగా రూపాంతరం చెందింది. ఈ అక్రమాల మనీ ట్రయల్స్, భూ బదిలీల వెనుక ఉన్న నిజాన్ని సీఐడీ పూర్తిస్థాయిలో వెలుగులోకి తెస్తే.. అది బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బ కావడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని కీలక రాజకీయ పరిణామాలకు బాటలు వేస్తుంది.

హోటల్స్ కు మద్దతుగా ఓవైసీ

హైదరాబాద్, : భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్దిష్ట గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు,



చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు. హోటల్ నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇచ్చి, వారిలో అవగాహన పెంచేలా అధికారులు సహకారాత్మక ధోరణితో వ్యవహరించాలని కోరారు

సిటీలో హై-ఎండ్ ఓవర్ సప్లై

హైదరాబాద్, : కోవిడ్ తదుపరి కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రూ. 2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన లగ్జరీ,అల్ట్రా-లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. దాంతో ప్రముఖ బిల్డర్లు, డెవలపర్లు అంతా తమ దృష్టిని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలపైనే కేంద్రీకరించారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం , వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వడంతో ప్రస్తుతం భాగ్యనగరంలో లగ్జరీ విభాగంలో అమ్ముడవని గృహాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి హై-ఎండ్ ఓవర్ సప్లై పరిస్థితి ఏర్పడింది.నగరంలో భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో పాటు ఇళ్ల ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోవడం కొనుగోలుదారుల్లో నిరాశను నింపింది. రూ. 2 కోట్ల పైబడిన ఆస్తులను కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న ఉన్నత వర్గాల డిమాండ్ ఒక స్థాయికి చేరుకుని సంతృప్త స్థితికి రావడంతో, మార్కెట్‌లో భారీగా నిర్మించిన లగ్జరీ ఫ్లాట్లు అమ్ముడవకుండా మిగిలిపోతున్నాయి. ఇది డెవలపర్ల మూలధనం నిలిచిపోయేలా చేసి, ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.ఈ సవాలును అధిగమించేందుకు నగర రియల్టర్లు తమ వ్యూహాన్ని వేగంగా మార్చుకుంటున్నారు. విలాసవంతమైన లగ్జరీ నిర్మాణాల కంటే నిజమైన కొనుగోలుదారులు అధికంగా ఉన్న 70 లక్షల నుంచి 1.20 కోట్ల బడ్జెట్ ప్రాజెక్ట్‌లను డిజైన్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మధ్యతరగతి , ఎగువ-మధ్యతరగతి ఉద్యోగులు, ఐటీ రంగానికి చెందిన యువ కొనుగోలుదారుల బడ్జెట్‌కు తగినట్లుగా 2ఱఱఐ, 3ఱఱఐ ఫ్లాట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ కారిడార్లకు కాస్త దూరంగా ఉన్న గ్రోత్ కారిడార్లు, నివాస ప్రాంతాలలో ఈ మిడ్-సెగ్మెంట్ గృహాల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. అనవసరమైన విలాసవంతమైన ఆమేనిటీస్‌ను తగ్గించి, స్థల వృధా లేకుండా సమర్థవంతమైన లేఅవుట్లతో అందుబాటు ధరల్లో ఇళ్లను అందించడం ద్వారా మార్కెట్‌లో నిలిచిపోయిన క్రయవిక్రయాలకు మళ్లీ ఊపిరి పోయవచ్చని రియల్ ఎస్టేట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను మరింత సుస్థిరమైన దారిలో నిలబెడుతోంది.

క్రీడల్లోనూ సత్తా చాటుతున్న మహిళా కానిస్టేబుల్..

వాలీబాల్‌లో గోల్డ్ మెడల్.. కబడ్డీలో సిల్వర్ మెడల్!



పెన్‌పహాడ్: పోలీస్ విధులు నిర్వహిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ తెలంగాణ పోలీస్ శాఖకు గుర్తింపు తెస్తున్నారు మహిళా కానిస్టేబుల్ నందిపాటి దీపిక. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్-5లో వాలీబాల్‌లో స్వర్ణ పతకం, కబడ్డీలో రజత పతకం సాధించి సత్తా చాటారు. అంతేకాకుండా 2027లో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిఫెండర్‌గా ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా పొనుగోడు గ్రామానికి చెందిన దీపిక ప్రస్తుతం పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న ఆమె.. పాఠశాల, కళాశాల స్థాయిల్లో నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోలీస్ శాఖలో చేరిన తర్వాత కూడా క్రీడలపై ఆసక్తిని కొనసాగిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. గత మూడేళ్లుగా తెలంగాణ పోలీస్ జట్టు తరఫున జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో దీపిక పాల్గొంటున్నారు. 2025లో పంజాబ్‌లో, 2026లో జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. తాజాగా వరంగల్‌లో జరిగిన తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్-5లో రెండు పతకాలు సాధించి మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. 2027లో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిఫెండర్‌గా ఎంపికై మరో ఘనత సాధించారు. దీపిక క్రీడా విజయాల వెనుక తండ్రి నాగేంద్రబాబు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కీలకంగా ఉంది. ఇటీవల సాధించిన విజయాలపై జిల్లా ఎస్పీ నరసింహ ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న దీపికను పెన్‌పహాడ్ ఎస్ఐ బాలునాయక్, సహచర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?

హైదరాబాద్,: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు?మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు ఘన్ పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.పైప్‌లైన్ నిర్మాణ పనులను రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, నిర్దిష్ట గడువులోగా అనుసంధానం చేయాలని ఎండీ ఆదేశించారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేసిందనేది ముఖ్యం కాదని, పనులు పూర్తయి పైప్‌లైన్ అనుసంధానం కావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల పరిధికి సంబంధించిన బిల్లుల సర్దుబాటును తర్వాత పరిశీలించవచ్చని, ప్రస్తుతం పనుల పూర్తికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధాన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ప్రత్యేక కార్మిక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకు వేర్వేరు బృందాలను నియమించి, పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు. రాత్రివేళ పనులకు అవసరమైన ఫ్లడ్‌లైట్లు, యంత్ర సామగ్రి, ఇతర సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధానానికి కీలకమైన రోడ్డు క్రాసింగ్ పనులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. అవసరమైన అనుమతులు, భద్రతా ఏర్పాట్లతో రాత్రి నుంచే రోడ్డు కటింగ్ పనులు ప్రారంభించి, రెండు మూడు రోజుల్లో పైపుల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఇందుకోసం అదనంగా రెండు మూడు ప్రత్యేక కార్మిక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.గోదావరి జలాల తరలింపునకు చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు మిషన్ భగీరథ, అటవీశాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. పైప్‌లైన్ అనుసంధానానికి అవసరమైన సాంకేతిక సహకారం, యంత్రాలు, మానవ వనరులను ఆయా శాఖల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న గోదావరి ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైన సాంకేతిక నిపుణులు, కార్మిక బృందాలు, ఎక్స్‌కవేటర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర భారీ యంత్ర సామగ్రిని అవసరమైన మేరకు ఈ పనులకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేసి, అక్కడి యంత్రాలు, వాహనాలు, సిబ్బందిని ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలన్నారు.రాబోయే వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా సింగూరు?మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించే ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పైప్‌లైన్ అనుసంధాన పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికావడం జలమండలి ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, అధికారులు, నిర్మాణ సంస్థలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, రోజుకు 40 ఎంజీడీల గోదావరి అదనపు జలాల సరఫరాకు మార్గం సుగమం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

ఇమ్రాన్ ఖాన్ కంటికి చికిత్స.. ఆస్పత్రికి తరలింపు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ను కంటి చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ వ్యవస్థాపకుడైన ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి జైలులో ఉంటున్న విషయంతెలిసిందే. సుమారు100కుపైగా కేసులు ఆయనపై ఉన్నాయి. అవినీతి, హింసనుప్రేరేపించిన కేసుల్లో ఇమ్రాన్ నిందితుడు. రావల్పిండిలోని అడియాలా జైలులో అతన్ని నిర్బంధించారు. అయితే జనవరి నుంచి ఇమ్రాన్ ఖాన్ తన కుడి కన్నుకు చికిత్స చేయించుకుంటున్నారు. చూపు మందగించినట్లు ఫిర్యాదు చేయడంతో చికిత్స ప్రారంభమైంది. పాకిస్థాన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు ఇమ్రాన్‌ను పరీక్షల కోసం తీసుకెళ్తారు. ఇమ్రాన్ ఖాన్‌కు చికిత్స అందిస్తున్న కంటి డాక్టర్ సూచన మేరకు అతనికి పరీక్షలు చేసినట్లు పీఐఎంఎస్ అధికారి పేర్కొన్నారు. చికిత్స సమయంలో ఇమ్రాన్‌కు ఇంట్రావిట్రియల్ యాంటీ వీఈజీఎఫ్ ఇంజెక్షన్ ఇచ్చారు. 2018లో ఇమ్రాన్ ప్రధాని అయ్యారు. అయితే 2022లో జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఆయన ఓడారు.



రూ.66కే బియ్యం



నిజామాబాద్, : బియ్యం ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరలకు గరిష్ట పరిమితులు విధించింది. కొంతమంది ఎక్కువ ధరలకు బియ్యాన్ని విక్రయిస్తున్న క్రమంలో దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బియ్యం ధరలను ఫిక్స్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలులోపే బియ్యం విక్రయించాలి. అంతకంటే అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. బియ్యం రకాలను బట్టి గరిష్ట ధరలను ఫిక్స్ చేసింది. అలాగే బియ్యం బస్తాలపై గరిష్ట చిల్లర ధరలను కూడా ముద్రించాల్సిందేనని ఆదేశించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. బియ్యం ధరల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించింది.బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యంకు సంబంధించి కిలో గరిష్ట ధర రూ.66గా ఫిక్స్ చేసింది. ఇక ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో గరిష్ట ధర రూ.74గా పరిమితి విధించింది. అలాగే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకం బియ్యం గరిష్ట చిల్లర ధర రూ.79గా నిర్ణయించింది. ఎల్‌నినో ప్రభావం క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో బియ్యం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. తెలంగాణలోనూ బియ్యం ధరలు పెరగ్గా.. కొంతమంది వ్యాపారులు దీనిని అసరాగా తీసుకుని ధరలు పెంచేస్తున్నారు. కిలో రూ.100, ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్రంలో బియ్యం కొరత ఉందనే ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. తగినన్ని నిల్వలు ఉన్నాయని, అందులో ఎలాంటి సమస్య లేదని పేర్కొంది.

మార్కెట్ ధరలను తారుమారు చేయడం, బియ్యంను అక్రమంగా నిల్వచేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరించింది. నిరంతరం మిల్లర్లు, వ్యాపారులపై తనిఖీలు జరుగుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపింది. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. రిటైల్ దుకాణాలు, టోకు వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పడే పడే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోపు మాత్రమే బియ్యం అమ్మాలని తెలిపింది. కాగా తెలంగాణలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.100 వరకు చేరుకున్నాయి

భార్యను హత్య చేసి దుస్తులు తొలగించిన భర్త..



చండీగఢ్: ఒక వ్యక్తి తన భార్యను అనుమానించాడు. ఈ నేపథ్యంలో గొంతు నొక్కి ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత భార్య దుస్తులు తొలగించి మృతదేహాన్ని ఒకచోట పడేశాడు. ఆమెపై హత్యాచారం జరిగినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన జహదూర్ ఇస్లాం తన భార్య రుబీనా ఖాతున్‌తో కలిసి పంజాబ్‌కు వలసవచ్చాడు. ముకేరియన్‌లోని మదీన్‌పూర్ గ్రామంలో వారు నివసిస్తున్నారు. మురుగునీటి కాలువలు, డ్రైనేజీలను శుభ్రపరిచే పనులు చేస్తూ జీవిస్తున్నారు. కాగా, భార్య రుబీనా ఖాతున్‌కు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు భర్త జహదూర్ అనుమానించాడు. దీంతో కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పని ముగిసిన తర్వాత

హత్యాచారంగా నమ్మించేందుకు యత్నం

గ్రామం సమీపంలోని చెరువు వద్దకు భార్య రుబీనాను భర్త తీసుకెళ్లాడు. గుడ్డ తువ్వాలుతో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత రుబీనా శరీరంపై ఉన్న దుస్తులను తొలగించాడు. సమీపంలోని చెరకు తోటలో ఆమె నగ్న మృతదేహాన్ని పడేశాడు. రుబీనాపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించాడు. మరోవైపు భార్య హత్య తర్వాత బీహార్‌లోని కతిహార్ జిల్లాకు చెందిన బావ సోహెల్ అలీకి, జహదూర్ ఫోన్ చేశాడు. తన భార్య రుబీనా కనిపించడం లేదని చెప్పాడు. దీంతో ఆందోళన చెందిన రుబీనా సోదరుడు హుటాహుటిన పంజాబ్‌లోని మదీన్‌పూర్ గ్రామానికి చేరుకున్నాడు. వారిద్దరూ రుబీనా కోసం వెతకడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే భార్య రుబీనా అదృశ్యంపై భర్త జహదూర్ ఇస్లాం పొంతన లేని సమాధానాలను పోలీసులకు చెప్పాడు. దీంతో అతడిపై అనుమానించి గట్టిగా ప్రశ్నించారు. చివరకు భార్యను తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వివరాల ఆధారంగా చెరకు తోటలో పడేసిన రుబినా నగ్న మృతదేహాన్ని గుర్తించి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. కాగా, భార్యపై ఎవరో లైంగిక దాడికి పాల్పడి హత్య చేసినట్లుగా నమ్మించేందుకు నిందితుడు ఇలా చేశాడని పోలీస్ అధికారి తెలిపారు. జహదూర్ ఇస్లాంను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఏపీకి రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులు..

24 లక్షల ఉద్యోగాలే లక్ష్యం: ఎంపీ విజయ్

అమరావతి, నవంబర్ 11: విశాఖపట్నంలో రేపటి నుంచి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సీఐఐ సమ్మిట్ ప్రారంభంకానుందని ఎంపీ చింతకాయల విజయ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వైజాగ్ సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామన్నారు. దేశం మొత్తం మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని.. దీనికంతటికీ కారణం 'బ్రాండ్ సీబీఎన్' అని చెప్పుకొచ్చారు. యువతకు భరోసానిస్తూ నిజమైన 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా మంత్రి నారా లోకేశ్ నిలిచారన్నారు.

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఎంపీ విమర్శించారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ గతంలో జగన్ ప్రభుత్వం అంతా పచ్చి అబద్ధాలే చెప్పిందని మండిపడ్డారు. యువతను మోసం చేస్తూ యూట్యూబ్ ఛానళ్లు, అప్పడాలు, బొబ్బట్లు తయారీ కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారంటూ ఎద్దేవా చేశారు. అప్పట్లో పరిశ్రమలను వెళ్లగొడితే... కూటమి పాలనలో పెట్టుబడులకు ఏపీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 25.3 శాతం పెట్టుబడులను ఆకర్షించి ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా నిలిచిందని విజయ్ తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చామన్నారు. సింగిల్ డెస్క్ విధానం, పారదర్శక పాలనతో



పారిశ్రామికవేత్తలకు పూర్తి భరోసాను మంత్రి లోకేశ్ కల్పిస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల ప్రాజెక్టులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని... దాదాపు 15 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని స్పష్టం చేశారు. మొత్తం రూ. 26 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పరుగులు పెడుతోందన్నారు. ఏపీలో 8.51 శాతం జీఎస్‌డీపీ నమోదు అయ్యిందని.. దేశంలోనే రెండో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఏపీ నిలిచిందని ఎంపీ అన్నారు. ఉత్తరాంధ్రకు గూగుల్ ఏఐ హబ్, భోగాపురం ఎయిర్‌పోర్ట్... రాయలసీమలో ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ హబ్‌లు వచ్చాయన్నారు. అమరావతి నిర్మాణం పరుగులు పెడుతోందని, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ కంపెనీలు ఏపీకి క్యూ కడుతున్నాయని ఎంపీ చింతకాయల విజయ్ పేర్కొన్నారు

కూటమికి కూడా విడాకులు తప్పేలా లేవు

పవన్ కళ్యాణ్ వైవాహిక జీవితంపై తులసిరెడ్డి



అమరావతి, :ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఇది ఒక చీకటి రోజు అని అన్నారు. పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల విడాకులు తీసుకోవడం వారి వ్యక్తిగత విషయమే అయినప్పటికీ, సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసే స్థాయిలో ఉన్న నాయకుడు కావడంతోనే తాను స్పందించాల్సి వస్తోందని తులసిరెడ్డి అన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి డిప్యూటీ సీఎంగా, ఒక పార్టీ అధ్యక్షుడిగా సమాజంపై, ముఖ్యంగా యువతపై తీవ్ర ప్రభావం చూపే నాయకుడని తులసిరెడ్డి పేర్కొన్నారు. సాధారణ వ్యక్తులైతే ఎవరూ స్పందించరని, కానీ ఇంతటి ప్రజాదరణ ఉన్న నాయకుడు తీసుకునే నిర్ణయాలు

- పవన్ కళ్యాణ్ వ్యక్తిగత విషయాలపై స్పందించిన తులసిరెడ్డి
- పవన్ విడాకుల నిర్ణయం సమాజంపై ప్రభావం చూపుతుందని వ్యాఖ్య
- వివాహ బంధం అతి పవిత్రమైనదన్న తులసిరెడ్డి

సమాజంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతపై ఈ పరిణామాలు ఎలాంటి ముద్ర వేస్తాయో ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హిందూ సనాతన ధర్మంలో వివాహ బంధం అత్యంత పవిత్రమైనదని తులసిరెడ్డి గుర్తుచేశారు. పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలలో వధువుకు, ఆమె తల్లిదండ్రులకు జీవితాంతం అంకితమై ఉంటానని వరుడు అగ్నిసాక్షిగా వేద ప్రమాణం చేస్తాడని తెలిపారు. మూడు ముళ్లు, ఏడడుగుల బంధం అత్యంత పవిత్రమైనవని చెప్పారు. అలాంటి పవిత్రమైన వేద ప్రమాణానికి పవన్ కళ్యాణ్ చర్య భంగం కలిగిస్తోందని ఆయన అన్నారు. పిల్లలకు మంచి తల్లిదండ్రులుగా, ఒకరికొకరు మంచి స్నేహితులుగా ఉంటామని చెబుతున్నప్పుడు, మంచి భార్యాభర్తలుగా ఎందుకు కలిసి ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ చర్యను సమాజం ఎప్పటికీ హర్షించదని తులసిరెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిణామాలను చూస్తుంటే భవిష్యత్తులో కూటమికి కూడా విడాకులు తప్పవేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై తులసిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీశాయి.

వామపక్షాలకు తగిన గుర్తింపు ఇచ్చిన సోనియాగాంధీ : జాన్ బ్రిట్టాస్



తిరువనంతపురం : యుపిఎ ఏర్పాటులో, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడంలో వామపక్ష పార్టీలు పోషించిన పాత్రకు సోనియాగాంధీ తన జ్ఞాపకాల పుస్తకంలో తగిన గుర్తింపు ఇచ్చారని సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ)కు మద్దతు తెలిపిన సమయంలో సిపిఐ(ఎం) అధికారాన్ని గానీ, ప్రభుత్వ పదవులను గానీ ఆశించలేదని, బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేసిందని ఆయన తెలిపారు. సోనియాగాంధీ రాసిన 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకంపై బుధవారం ఆయన స్పందించారు. యుపిఎ ఏర్పాటులో సిపిఐ(ఎం), ఇతర వామపక్ష పార్టీల పాత్రకు సోనియాగాంధీ తగిన గుప్తింపు ఇచ్చారని తాను భావిస్తున్నానని, కేరళలోని కాంగ్రెస్ నేతలు ఈ విషయాన్ని గుర్తించాలని జాన్ బ్రిట్టాస్ సూచించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమికి వామపక్షాలు అందించిన సహకారాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంలో భాగస్వాములు కాకూడదని నిర్ణయించుకున్నప్పటికీ, బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే బాధ్యతను సిపిఐ(ఎం) నేతలు తమ భుజాన వేసుకున్నారని పేర్కొన్నారు. అధికారం, పదవులపై ఆశ లేకుండానే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపామని స్పష్టం చేశారు. సోనియాగాంధీ జ్ఞాపకాల పుస్తకంపై బిజెపి చేస్తున్న విమర్శలను కూడా జాన్ బ్రిట్టాస్ తప్పుబట్టారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు పాల్పడిన కరసేవకులు, సంఘ్ పరివార్ బృందం తనను కూడా మోసం చేశాయని బిజెపి సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ గతంలో ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఆ ఇంటర్వ్యూను బిజెపి నేతలు మరోసారి పరిశీలించాలని సూచించారు. తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేసిన తర్వాత అద్వానీ పట్ల బిజెపి వ్యవహరించిన తీరును ఆయన ప్రశ్నించారు. కొంతమంది వ్యక్తులు, కొన్ని పరిణామాలపై తన అభిప్రాయాలను వెల్లడించినందుకే అద్వానీని నాయకత్వం నుంచి పక్కనపెట్టారా అని ప్రశ్నించారు. అందుకు కారణమేమిటని జాన్ బ్రిట్టాస్ బిజెపిని నిలదీశారు.

జనవరి 1 నుంచి సంజీవిని ప్రాజెక్టు అమలుకు ఏర్పాట్లు



జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంజీవిని–టాటా డిజిటల్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ఫర్ కేర్ ప్రాజెక్టును 2027 జనవరి 1 నుంచి కాకినాడ జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ .... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల వరకు డిజిటల్ వైద్య సేవలను అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో వర్చువల్ సంప్రదింపులు, ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్లు, రిఫరల్ సేవలు, డిజిటల్ హెల్త్ రికార్డులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లాలోని 65 ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఏబీహెచ్‌ఏ ఐడీలు సృష్టించి డిజిటల్ ఆరోగ్య రికార్డులతో అనుసంధానం చేయాలని, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్లుగా సంజీవిని మిత్రలను నియమించాలని ఆదేశించారు. ప్రాజెక్టు అమలును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, ఏపీఎంఎస్ఐడీసీ, టాటా సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎంఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మహేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగుదారులకే నష్టపరిహారం చెల్లించాలి



భీమవరం : అర్నాబ్ తుఫాన్ రైతాంగాన్ని అతలాకుతలం చేసిందని లక్షలాది ఎకరాల్లో వరిచేలు నేటికీ నీటిలో వరి దుబ్బులు నాని పోయి కుళ్లిపోయాయని వాస్తవ సాగుదారుల పేరుని పంట నష్టాన్ని నమోదు చేసి సాగుదారులకే నష్టపరిహారాన్ని చెల్లించాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి బలరాం డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలం శృంగ వృక్షం గ్రామంలో తుఫాన్ ప్రభావానికి నీట మునిగిన వరి పొలాలను బలరాం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, కౌలు రైతులు సూర్యనారాయణ రాజు, వెంకట నాగేశ్వరరావు, దుర్గారావు, నారాయణ రాజులు సమస్యలను బలరాం దృష్టికి తీసుకువచ్చారు. తుఫాను దాటికి సర్వం కోల్పోయామని చెప్పారు. పంట నష్టాన్ని యజమానుల పేరున నమోదు చేశారని వాపోయారు. ఇప్పటికే రూ. 30 వేలు ఖర్చు చేసామని వరి పంటను మాసుళ్ళు చేసిన అదనంగా ఖర్చులు అవుతాయి తప్ప పెట్టుబడులు రావని చెప్పారు. రెండు పంటలకు 30 బస్తాలు కౌలుకు చెల్లిస్తున్నామని పంట తీవ్రంగా నష్టపోయిన కౌలుకు మాత్రం చెల్లించక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బలరాం మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైబడి పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. వరి చేలల్లో ఎప్పటికీ గుండెత్తు వరకు వర్షపు నీరు నిల్వ ఉందని పంట మొత్తం కుళ్లిపోయిందని పేర్కొన్నారు. రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పంట నష్టాన్ని అంచనా వెయ్యాలన్నారు. వాస్తవ సాగుదారులు, కౌలు రైతుల పేరున పంట నష్టాన్ని నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోయినా ఇన్సూరెన్స్ ను కౌలు రైతులకు అందజేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారని ఇప్పటివరకు ఏ కౌలు రైతులకు ఇవ్వలేదని తక్షణం వారికే అన్నదాత సుఖీభవ , పీఎం కిసాన్ కూడా అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన కౌలు రైతులు పట్ల యజమానులు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. కౌలును రద్దు చేయాలని యజమానులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కౌలు

- వారి పేరునే పంట నష్టాన్ని నమోదు చేయాలి
- ప్రీమియం కట్టకపోయినా ఇన్సూరెన్స్ అందించాలి
- ఏడాది పాటు దేవాలయ భూములు కౌలుకు ఉచితంగా ఇవ్వాలి
- కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. బలరాం

రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నష్టపోయిన సన్న చిన్న పేద కౌలు రైతులను రైతులను అందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. దాల్వాకు విత్తనాలు ఎరువులు పురుగు మందులు 50 శాతం సబ్సిడీపై ఇచ్చి ఆదుకోవాలన్నారు . వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన వ్యవసాయ రైతాంగంతో పాటు ఇతర పంటల రైతన్న కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఏడాది పాటు ఉచితంగా దేవాలయ భూములు కౌలుకు ఇవ్వాలి: దేవాలయ భూములు చేస్తున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చాలా ప్రాంతాల్లో ముందస్తు కౌలు చెల్లించాలని పంట నష్టం జరిగింది చోట చెల్లించిన కౌలు తిరిగి కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. మరో ఏడాది పాటు ఉచితంగా సాగు చేసుకునేందుకు దేవాలయ భూములు కౌలుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూముల కౌలు రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం మాజీ రాష్ట్ర నాయకులు శేషాపు ఆశ్రయ, ఇతర నేతలు రైతులు ఉన్నారు .

ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: కలెక్టర్



కాకినాడ: విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యలో రాణించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి అపూర్వ భరత్, డిఆర్‌ఒ తిప్పే నాయక్, తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ దేశ విద్యారంగ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆయన అనేక సంస్కరణలకు పునాదులు వేశారని పేర్కొన్నారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సామాజిక మార్పునకు, దేశ ప్రగతికి కీలకమైన సాధనమని ఆజాద్ విశ్వసించారని తెలిపారు. ఉన్నత, సాంకేతిక విద్య అభివృద్ధికి విశేష కృషి చేస్తూ ఐఐటీలు, విశ్వవిద్యాలయాల స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానం, పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే కాదని, నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవీయ దృక్పథాన్ని అలవర్చుకోవడం కూడా అందులో భాగమని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల్గాంలో ఉగ్రవాదుల కాల్పులు..

ముగ్గురు జవాన్లకు గాయాలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని కుల్గాంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగుర్గు సిఆర్‌పిఎఫ్ జవాన్లకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం కుల్గాం జిల్లాలోని ఒక తనిఖీ కేంద్రం వద్ద మోహరించిన భద్రతా బలగాలపై మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపినట్లు సిఆర్‌పిఎఫ్ డిజి జి.పి.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాల్పులు జరిపిన అనంతరం దుండగులు అక్కడినుండి పారిపోయారని అన్నారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు [illegible] తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం

పారిశ్రామికవేత్తలతో మంత్రి పొన్నం భేటీ

- సమావేశానికి హాజరైన 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు
- వచ్చే నెలలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై దృష్టి
- తెలంగాణను అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న మంత్రి



హైదరాబాద్, : తెలంగాణను ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వచ్చే నెలలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆటో, ఈవీ రంగాల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది. హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. కొత్త యూనిట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విస్తరణ, విధానపరమైన అవసరాలపై పరిశ్రమ వర్గాల నుంచి మంత్రి సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాల్లో భాగంగానే ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే ఆటోమొబైల్, ఈవీ పెట్టుబడులకు తెలంగాణను అగ్రగామి గమ్యస్థానాల్లో ఒకటిగా నిలపడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ఈ రంగాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించేందుకు అవసరమైన కీలక అంశాలను కూడా ఈ సమావేశంలో గుర్తించారు.

ఆస్తి హక్కులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు..

- పంపకాల ద్వారా తండ్రికి సంక్రమించిన ఆస్తిపై మనవడికి జన్మతః హక్కు ఉండదన్న సుప్రీం
- అది తండ్రి వ్యక్తిగత ఆస్తి అవుతుంది కానీ, ఉమ్మడి కుటుంబ ఆస్తి కాదని స్పష్టీకరణ
- హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఈ ఆస్తి బదిలీ అవుతుందని వెల్లడి
- మనవడి వాటా కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



డిల్లీ: ఆస్తి హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. తాత ఆస్తి పంపకాల్లో భాగంగా తండ్రికి సంక్రమించిన ఆస్తిపై మనవడికి జన్మతః ఎలాంటి హక్కులు ఉండవని స్పష్టం చేసింది. హిందూ వారసత్వ చట్టం, 1956లోని సెక్షన్ 8 ప్రకారం తండ్రి పొందిన ఆస్తి, అతని వ్యక్తిగత ఆస్తిగా పరిగణించబడుతుందని, అది ఉమ్మడి కుటుంబ ఆస్తి కాదని తెలిపింది. జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సునీత అగర్వాల్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. జె. రాజేష్ (మైనర్) తన తల్లి జె. గోమతి ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది. చెన్నైలోని ఒక ఆస్తిలో తనకు సగం వాటా ఇప్పించాలని కోరుతూ రాజేష్ ఈ పిటిషన్ వేశాడు. ఈ ఆస్తిని అతని తండ్రి 1994లో ఒక పంపకాల దావాలో రాజీ డిక్రీ ద్వారా పొంది, 1997లో విక్రయించారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు, హిందూ వారసత్వ చట్టంలోని నిబంధనలను కూలంకషంగా వివరించింది. వీలునామా రాయకుండా ఒక హిందూ పురుషుడు మరణించినప్పుడు, అతని ఆస్తి సెక్షన్ 8 ప్రకారం మొదటి తరగతి వారసులకు చెందుతుందని పేర్కొంది. ఈ వారసులలో కొడుకు, ముందుగా చనిపోయిన కొడుకు యొక్క కొడుకు ఉంటారు కానీ, బ్రతికి ఉన్న కొడుకు యొక్క కొడుకు (మనవడు) ఉండడని ధర్మాసనం స్పష్టం చేసింది. పంపకాల ద్వారా కొడుకు పొందిన ఆస్తి అతని వ్యక్తిగత హోదాలో ఉంటుందని, అది హిందూ ఉమ్మడి కుటుంబ ఆస్తిగా మారదని కోర్టు స్పష్టం చేసింది. ఒకసారి ఆస్తి పంపకాలు జరిగాక, అది ఉమ్మడి కుటుంబ భావాన్ని కోల్పోతుంది. వారసులు తమ వాటాలను వ్యక్తిగతంగా కలిగి ఉంటారు. అందువల్ల ఆ ఆస్తిపై అతని పిల్లలకు (మనవళ్లకు) జన్మతః హక్కులు లభించవని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ (మనవడు) పుట్టకముందే వారసత్వం ప్రారంభమైందని, ఈ కేసుకు హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 6 గానీ, కుమార్తెలకు సమాన హక్కులు కల్పించే తమిళనాడు సవరణ గానీ వర్తించదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కారణాలతో ఆస్తిలో వాటా కోరుతూ మనవడు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ, హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

80 లక్షల మంది పట్టభద్రులలో..

10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత
ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య
యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

తండ్రి, కూతురిని కారులో వెంబడించి..

కాల్పులు జరిపిన వ్యక్తులు



చండీగఢ్: కారులో ప్రయాణించిన తండ్రి, కూతురిని కొందరు వ్యక్తులు మరో కారులో వెంబడించారు. ఇంటికి చేరుకున్న వారి వాహనంపై కాల్పులు జరిపి పారిపోయారు. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పంజాబ్‌లోని ఫాజిల్కా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం మధ్యాహ్నం మనీష్ కుమార్ అనే వ్యక్తి తన ఏడాది కుమార్తెతో కలిసి ఫాజిల్కా నుంచి సురేశ్వాలా గ్రామంలోని ఇంటికి కారులో బయలుదేరాడు. కాగా, కొందరు వ్యక్తులు స్విఫ్ట్ కారులో మనీష్ వాహనాన్ని వెంబడించారు. అతడిని ఉద్దేశించి వారు అరిచారు. ఏదో ప్రమాదం జరుగబోతోందని గ్రహించిన మనీష్, తన కారు వేగాన్ని పెంచాడు. గ్రామంలోని ఇంటికి చేరుకోగా మరో కారులోని వ్యక్తులు అక్కడి వరకు వెంబడించారు. మనీష్ తన ఇంటి ముందు కారు ఆపగానే ఆ వాహనంలోని వ్యక్తులు కిందకు దిగారు. మనీష్ కారుపై రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. మనీష్ కారు విండ్‌షీల్డ్, బాడీకి బుల్లెట్లు తగిలాయి. మనీష్ వెంటనే కారు వేగం పెంచి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీంతో అందులో ఉన్న ఆ తండ్రీకూతుళ్లు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. మనీష్‌పై కాల్పులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంఘటన పంజాబ్‌లో రాజకీయ విమర్శలకు దారి తీసింది.

రిజిస్ట్రేషన్ల కోసం అక్రమ వసూళ్ల దందా..?



ఆసిఫాబాద్ : వాంకిడి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు బరితెగిస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం రైతుల నుంచి రూ.5 నుంచి రూ.10 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుముతో సంబంధం లేకుండా ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ పైస్థాయి అధికారి నుంచి మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. చేతులు తడిపితేనే గంటల్లోనే పని..? లేదంటే పెండింగే ఇక్కడ పరిపాటిగా మారింది. ఈ దందా వెనుక ఓ ప్రధాన అధికారి సూత్రధారిగా ఉండగా, కార్యాలయంలోని ఓ ఉద్యోగి కలెక్షన్ ఏజెంట్‌గా రసీదులు లేని అక్రమ వసూళ్లను సాగిస్తున్నట్లు బాహాటంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న రైతులను నిలువునా దోచుకుంటున్నా ఉన్నతాధికారులు నిఘా పెట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

డబ్బులు ఇస్తేనే పనులు..!: వాంకిడి రెవెన్యూ కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.. లేదంటే ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్‌లోనే పెడుతున్నారు. భూ సమస్యలకు సంబంధించి రిపోర్టు ఇచ్చే పని మొదలుకొని భూముల విరాసత్ రిజిస్ట్రేషన్ల వరకు ఇలా ఏ పని కావాలన్నా సంబంధిత రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టజెప్పడం ఇక్కడ తప్పనిసరిగా మారింది. అదికూడా పని కాక ముందే.. అప్రకటిత నిబంధన నడుస్తోంది. రిజిస్ట్రేషన్ స్థలాన్ని బట్టి రూ.5 నుంచి రూ.10 వేలు.. పంచనామా రాసిన ఆర్ఐకి రూ.2 వేలు. భూ సరిహద్దులు పరిశీలించిన సర్వేయర్‌కు రూ.2 వేలు. భూ రికార్డులు పరిశీలించిన రికార్డు అసిస్టెంట్‌కు రూ.500 చొప్పున అదనంగా డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అడిగినంత ఇస్తేనే తొందరగా పనులు పూర్తయి పత్రాలు చేతికి అందుతాయి. ఇవ్వకపోతే సర్వర్ పనిచేయడం లేదని.. రికార్డులు దొరకడం లేదని కాలయాపన చేస్తూ తిప్పుకుంటున్నారు. ఈ లెక్కలు రిజిస్ట్రేషన్ వరకు మాత్రమే.. ఇక విరాసత్ అయితే చిన్నపాటి పొరపాట్లు ఉన్నా.. ఆ అధికారి అడిగినంత రైతులు ఇవ్వాల్సిందే. లేదంటే ఆ రికార్డు పెండింగ్‌లోనే ఉంటుంది. ఈ విషయంలో పై అధికారికి ఎవరికి ఫిర్యాదు చేసినా వారికి నో ప్రాబ్లం.

ప్రధాన శ్రేణి అధికారే సూత్రధారి..?: ఈ అక్రమ వసూళ్ల చక్రవ్యూహం వెనుక కార్యాలయంలోని ఓ ప్రధాన శ్రేణి అధికారి సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారి ఆదేశాల మేరకు కార్యాలయంలోని ఓ కిందిస్థాయి ఉద్యోగి కలెక్షన్ ఏజెంట్‌గా మారి బాధితులతో, మధ్యవర్తులతో ఫోన్‌లో బేరసారాలు మాట్లాడి నేరుగా నగదు వసూలు చేసి.. ఆ అధికారికి ముట్టజెబుతున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో ఒకే రోజు రెండు వేర్వేరు రిజిస్ట్రేషన్ల కోసం ఇద్దరు బాధితుల నుంచి ఒక్కో పనికి ఒక్కో రేటు కట్టి పైస్థాయి అధికారి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి..! : కార్యాలయంలో ఇప్పటి వరకు ఎన్ని విరాసత్ దరఖాస్తులు వచ్చాయి.. రిజిస్ట్రేషన్లు జరిగాయి.. రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసిన నగదు ఎంత.. అనే అంశాల పై ఆడిట్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారి, సిబ్బంది వ్యవహారం పై ఆర్డీవో, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించడంతో పాటు అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం'

- ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం
- ఈ 15న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పిలుపు



నల్లగొండ, నవంబర్ 11 : కార్మిక కర్షక మైత్రితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు. బుధవారం భారత ఆహార సంస్థ హమాలి వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నల్లగొండ ఆధ్వర్యంలో ఈ నెల 15న జరుగు రైతు మహాసభ సందర్భంగా బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు కార్యాలయం నుండి మైసయ్య విగ్రహం, ప్రకాశం బజార్ ఎగ్బాల్ మినార్, మిర్యాలగూడ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చేస్తున్న కుట్రలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం
కలెక్టర్ రాహుల్ శర్మ



మహాదేవపూర్ (భూపాలపల్లి), నవంబర్ 11 : విద్య ద్వారానే వ్యక్తిగత వికాసంతో పాటు సమాజం, దేశాభివృద్ధి సాధ్యమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మౌలానా ఆజాద్ విద్యాభివృద్ధికి, జాతీయ సమగ్రతకు, మతసామరస్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మైనారిటీ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ కుమారస్వామి, అధికారులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

కరీంనగర్ కలెక్టరేట్ : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, డీఆర్ఓ స్వామి, మైనారిటీ సంక్షేమ అధికారి జలాలుద్దీన్ అక్బర్, డీఈఓ తిరుపతిరావు, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. గుర్తుతెలియని వ్యక్తి మృతి..

ములుగు: ములుగు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. హవేలీ ఫామ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ములుగు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పల్సర్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి, ములుగు వైపు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాధితుడికి తలతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో బాధితుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తెలుపు రంగు టీషర్ట్, ప్యాంటు ధరించి ఉన్నట్లు వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసినవారు, కుటుంబ సభ్యులు వెంటనే ములుగు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై రఘుపతి కోరారు.